# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-09-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ నుంచి ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు విడుదల చేస్తారు.**

2. **ఎన్డీయే ప్రభుత్వం దేశాభివృద్ధి కోసం అనేక కీలక సంస్కరణలు చేపట్టిందని కేంద్ర కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.**

3. **తెలంగాణలో కీలక ఖనిజాలపై పరిశోధనను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క వెల్లడించారు.**

4. **ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా చేపట్టిన అక్షర ఆంధ్ర కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తోందని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు.**

============================

పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ నుంచి ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు విడుదల చేస్తారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వద్ద రెగ్యులేటర్‌ను ఆన్ చేసి, గోదావరి జలాలకు జలహారతి ఇచ్చి స్వాగతం పలకనున్నారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా వచ్చే ఈ జలాలతో నాలుగు జిల్లాల్లోని వివిధ ఆయకట్టు పరిధిలో 2 లక్షల 87 వేల 320 ఎకరాలకు సాగునీరు, 5.23 లక్షల మందికి తాగునీరు అందనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంపై అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ మాట్లాడుతూ,

వాయిస్ ..30..సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం జిల్లా ఏటపాక మండలం గొల్లగుప్పలో పలువురు అస్వస్థతకు గురైన ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. మలేరియా నివారణ మాత్రలు వికటించడంపై వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని, ఘటనపై సమగ్ర విచారణ జరపాలని ఆదేశించారు. గ్రామంలో 71 మందికి మందులు పంపిణీ చేయగా, అస్వస్థతకు గురైన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గొల్లగుప్పలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్‌కుమార్ తెలిపారు.

---

ఈనెల 17వతేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప ఉత్సవాలలో భాగంగా అమరావతిలోని ఒక ప్రైవేటు విశ్వవిద్యాలయానికి చెందిన సుమారు 10 వేల మంది విద్యార్థులు పోస్ట్‌కార్డుల ద్వారా ప్రధానమంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులతో మాట్లాడారు. 2014 నుంచి నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అనేక కీలక సంస్కరణలు చేపట్టిందని పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొంటూ..

వాయిస్ ..30.. సెకన్లు

---

తెలంగాణలో కీలక ఖనిజాలపై పరిశోధనను వేగవంతం చేసేందుకు ఆస్ట్రేలియాకు చెందిన మోనాష్ విశ్వవిద్యాలయం, ఐఐటీ హైదరాబాద్, సింగరేణి సంస్థలతో 'త్రిముఖ' భాగస్వామ్యంతో పనిచేస్తామని ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క తెలిపారు. హైద్రాబాద్‌లోని ప్రజాభవన్‌లో అధికారులతో సమావేశమైన ఆయన ఖనిజ అన్వేషణ, అధునాతన ఖనిజ సాంకేతికతలపై నిన్న చర్చించారు. కీలక ముడి పదార్థాల కొరతను అధిగమించేందుకు సంస్థల భాగస్వామ్యం దోహదపడుతుందని తెలిపారు. హరిత ఇంధనం, విద్యుత్ వాహనాలు, ఎలక్ట్రానిక్స్ రంగాల విస్తరణలో కీలక ఖనిజాలు ముఖ్యమని అన్నారు. ఐఐటీ హైదరాబాద్‌లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను బలోపేతం చేసి అధునాతన పరిశోధన, సాంకేతిక అభివృద్ధికి వేదికగా తీర్చిదిద్దాలని సూచించారు.

---

ఆంధ్రప్రదేశ్‌లో 2027 నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధించేలా సమన్వయంతో పనిచేయాలని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో విద్యా శాఖ అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన అక్షర ఆంధ్ర కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా అక్షరాస్యత శాతం 72.6 నుంచి 82.1 శాతానికి పెరిగిందని చెప్పారు. అక్షర ఆంధ్ర కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి, ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని సూచించారు.

---

వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు. విజయవాడలో నిర్వహించిన బీజేపీ రాష్ట్ర స్థాయి కార్యశాలలో ఆంధ్రప్రదేశ్ బిజెపి అధ్యక్షులు పీవీఎన్ మాధవ్‌తో కలిసి ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్య కుమార్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ సుదీర్ఘకాలంగా ప్రజాసేవలో కొనసాగుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు 'సేవా సంకల్ప ఉత్సవాలు' నిర్వహించనున్నట్లు తెలిపారు.

---

శారీరక దృఢత్వం, అప్రమత్తత పోలీసుల విధి నిర్వహణలో కీలకమని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఏపీఎస్పీ 6వ బెటాలియన్ మైదానంలో తొలిసారిగా నిర్వహిస్తున్న

ఏపీ స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్–2026ను డీజీపీ నిన్న ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ పోలీసు రేంజ్‌లు, యూనిట్ల నుంచి 1,900 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. పోలీసులు శారీరక దృఢత్వం కోసం క్రీడలను తమ వృత్తి జీవితంలో భాగం చేసుకోవాలని ఈ సందర్భంగా డీజీపీ సూచిస్తూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా పలాసలో అగ్రికల్చరల్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ –ఏపీఈడీఏ, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో జీడిపప్పు ఎగుమతులపై నిన్న కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా జీడిపప్పు వ్యాపారులు, ఎగుమతిదారులకు ఎగుమతి విధానాలు, నిబంధనలు, ప్యాకేజింగ్, మార్కెట్ అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పలాస శాసన సభ్యురాలు గౌతు శిరీష పాల్గొని జీడిపప్పు పరిశ్రమ ఎదుర్కొంటున్న ముడిపదార్థాల కొరత, మౌలిక వసతులు, సరఫరా సమస్యలపై చర్చించారు. అలాగే ఏపీఈడీఏ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆర్.పీ. నాయుడు మాట్లాడుతూ, జీడిపప్పు ఎగుమతులను ప్రోత్సహించేందుకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.

---------------------------

తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటుకు ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడితో మంత్రి నిన్న ఢిల్లీలో సమావేశమైయ్యారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, గతంలో పరిశీలించిన రెండు స్థలాలు సాంకేతిక కారణాలతో అనుకూలంగా లేవని తేలడంతో కొత్త స్థలాలను గుర్తించినట్లు తెలిపారు.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం, అల్పపీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలోని పలు ప్రాంతాల్లో రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది.

తెలంగాణ రాష్ట్రంలోనూ రానున్న మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=====================